రానున్న ఎన్నికల్లో స్థానికతే ప్రధానాంశం..!

- ఆశావాహులు నోట అదే మాట...
- పాతపట్నంలో పలువురు స్థానికేతరులే ఎమ్మెల్యేలుగా ఎన్నిక

విశాలాంధ్ర-కొత్తూరు : రానున్న ఎన్నికల్లో పాతపట్నం నియోజకవర్గంలో స్థానిక నాయకత్వ అంశమే ప్రధాన ఎన్నికల ప్రచారం కానుందా? అంటే అవుననే పలువురు చర్చించుకుంటున్నారు. పాతపట్నం నుండి తెలుగుదేశం టికెట్ ఆశిస్తున్న ఆశావాహుల కన్నా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ టికెట్ ఆశావాహుల్లో వైస్ ఎంపీపీ ఆ పార్టీ సీనియర్ నాయకులు లోతుగెడ్డ తులసివరప్రసాద్‌రావునాయుడు, ప్రస్తుతం ఏపార్టీ పేరు చెప్పకుండా తాను రానున్న ఎన్నికల్లో పాతపట్నం నుండి పోటీ చేయడం ఖాయమని చెప్తూ దాదాపు గత ఏడాదిగా నియోజకవర్గంలో ఊరు, వాడ కలియ తిరుగుతున్న ప్రముఖ విద్యావేత్త సుపరిచితులు సిరిపురం తేజేశ్వర్‌రావులు ఈసారి స్థానికులనే ఎమ్మెల్యేలుగా ఎన్నుకోండి, వారే మీకు అందుబాటులో ఉంటారని నోటితో చెప్పడమే కాదు రంగురంగుల కరపత్రాలు ముద్రించి గ్రామాల్లో పంచి పెడుతున్నారు. ఇందుకు సహేతు కారణం లేకపోలేదు. ఈ నియోజకవర్గంలో ఎమ్మెల్యేలుగా ఎన్నికైన పోతుల గున్నయ్యా, మండా పెంటంనాయుడు తోట తులసిదాస్‌నాయుడు, నందమూరి లక్ష్మీపార్వతి, శత్రుచర్ల విజయరామరాజు, ప్రస్తుతం రెడ్డి శాంతిలు పాతపట్నంకు స్థానికేతరులే. ఎమ్మెల్యేలుగా పదవి ఉన్నంతవరకు ఇక్కడ ఉంటారు. తరువాత ఎన్నికల్లో ఓటమి చెందినా, ఒకవేళ టికెట్ రాకపోయినా మరి వీరు ప్రజలకు కనిపించరు. వారి స్వంత ఊరుకు మకాం మార్చేస్తారన్న విమర్శలు నాయకులే కాదు కొందరు ప్రజల నుండి వినిపిస్తున్నాయి. ఇప్పుడు చూద్దాం... నందమూరి లక్ష్మీ పార్వతి ఒకసారి ఎమ్మెల్యే అయిన తరువాత ఆమె హైదరాబాద్‌కు వెళ్ళిపోయింది. శత్రుచర్ల ఓటమి తరువాత తమ స్వంత ఊరూ చిన్నమెరింగికోటకు మకాం మార్చేశారు. ఇప్పుడు తాజా ఎమ్మెల్యే రెడ్డి శాంతి స్థానికురాలు కాదు, ఒకవేళ రేపు పోటీ చేసే అవకాశం రాకపోతే, పోటీచేసే పార్టీని ప్రజలు తిరస్కరిస్తే? ఆమె పాతపట్నంలో ఉండరని, అందుకే ఏపార్టీ అయినా స్థానికులకే పార్టీ టికెట్ ఇవ్వాలని, గెలిచినా ఓడినా ఇక్కడే ఉంటారంటూ ప్రచారం చేస్తున్నారు. తమను, పార్టీని నమ్ముకుని ఓట్లు వేసిన ప్రజలకు అవసరాల్లో, సమస్యల్లో అండగా ఉంటారని, స్థానిక వాదాన్ని వినిపించే ఆశావాహులు గట్టిగా గ్రామాల్లో తమ పర్యటనలలో ప్రజలకు చెప్తున్నారు. అంతేకాదు పార్టీ స్థానికేతరులకు టికెట్ ఇస్తే ఓడిస్తామని, వారు ఘంటాపథంగా చెపుతున్నారు. మరి ఆశావహులు వినిపిస్తున్న స్థానిక నినాదం ప్రధాన రాజకీయ పార్టీలు ఎంతవరకు పట్టించుకుంటాయో వేచిచూడాలి.

వ్యవసాయ రంగాన్ని ఆదుకోవాలి

- నేటి నుంచి 29 వరకు సచివాలయాల వద్ద నిరసనలు
- అల్లబోయిన అప్పలనాయుడు, లండ వెంకటరావు

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: రాష్ట్రంలో వర్షపాతం తక్కువ తో, చివారు భూములకు నీరు అందక కరువు ఛాయలు కనిపిస్తున్నాయని వ్యవసాయ రంగాన్ని ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంయు) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అల్లబోయిన అప్పలనాయుడు, లండ వెంకటరావులు కోరారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. ఈ యేడాది వర్షాలు లేక పంటలు సరిగా పండక రైతులు, రైతు కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, గ్రామీణ ప్రాంతాల్లో పనులు లేక ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్త పరిచారు. ఇటువంటి పరిస్థితుల్లో వ్యవసాయ కూలీలను, పేదలను ప్రభుత్వమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మికులకు, పేదలకు నెలకు రూ.10 వేలు పెన్షన్ తో పాటు నెలకు 35 కేజీల బియ్యం ఇవ్వాలని కోరారు. పేద విద్యార్ధులకు అన్ని రకాల ఫీజులు రద్దు చేసి, పేదల ఇళ్ళ కరెంటు బిల్లులు, బకాయిలను రద్దు చెయ్యాలన్నారు. రైతులకు పంట నష్టంతోపాటు ఇచ్చిన పంట రుణాలు మాఫీ చేసి కొత్త రుణాలు ఇవ్వాలని కోరారు. పశు గ్రాసం ఉచితంగా ఇవ్వాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి చూపేలా ప్రభుత్వం చర్యలు తీసుకుని ఉపాధి హామీ పథకం నిధులు కేంద్రం నుంచి ఎక్కువ వచ్చేలా నివేదికలు ఇచ్చి గ్రామీణ కూలీలను ఆదుకోవాలని, 200 రోజుల పని దినాలు కల్పించి, కనీస వేతనం రోజుకు రూ.600 ఇవ్వాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో సాగు, తాగు నీటి పరిష్కారానికి నిధులు విడుదల చెయ్యాలని కోరారు. వలసలు వెళ్లిన కూలీల పిల్లలు, వృద్ధులకు ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకోవాలని కోరారు. వలస వెళ్లిన వారిని తిరిగి రప్పించి ఉపాధి హామీ పనులతో స్థానికంగా ఉపాధి చూపాలన్నారు. ఈ తదితర డిమాండ్ లతో అన్ని గ్రామ సచివాలయాల వద్ద ఈనెల 25నుంచి 29 వరకు నిరసన కార్యక్రమాలు నిర్వహించి అధికారులకు వినతిపత్రం అందిస్తామని తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో సంఘ సభ్యులకు, రైతులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని వారు ఆ ప్రకటనలో కోరారు.

ఆడపిల్లలకు చదువే ముద్దు

విశాలాంధ్ర-ఆమదాలవలస: గ్రామీణ ప్రాంతాలలో స్వయం శక్తి సంఘ కుటుంబాలలో ఆడపిల్లలు అందరికీ చదువే ముద్దు అని, బాల్య వివాహాలు వద్దు అని వైయస్సార్ క్రాంతి పదం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మా రావు పిలుపునిచ్చారు. మంగళవారం జొన్న వలస పంచాయతీలో గల స్వయం శక్తి సంఘ సభ్యుల అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. గ్రామంలో మహిళలతో ర్యాలీ నిర్వహించి, బాల్య వివాహాల వల్ల వస్తున్న అనర్ధాలపై అవగా హన కల్పించారు. ఆడపిల్ల లందరినీ చదివి స్తామని ,ఎట్టి పరిస్థితుల్లో కూడా బాల్య వివాహాలను సమర్ధించ వద్ద ని, సభ్యు లందరితో ప్రతిజ్ఞ చేయించారు. పిల్లల ఆరో గ్యం,చదువు వల్ల కుటుంబానికి, గ్రామానికి, తద్వారా దేశానికి ఉన్న ప్రయోజనాలపై సభ్యులందరికీ అవగాహన కల్పించారు. మన రాష్ట్ర ప్రభుత్వం జగనన్న అమ్మఒడి, జగనన్న విద్యా కానుకలు అందిస్తూ, విద్యా దీవన ,వసతి దీవన మొదలగు పథకాల ద్వారా విద్యను ప్రోత్సహిస్తున్న విధానాన్ని గుర్తు చేశారు. పిల్లలలో ఎనిమియా రక్త హీనతపై అవగాహన కల్పిస్తూ, ప్రభుత్వము స్కూలు పిల్లలకు అందిస్తున్న జగనన్న గోరుముద్ద పథకం అమలు గురించి, బెల్లం తో తయారైన శనగ పలుకుల చిక్కిల పంపిణీ, రాగి మాల్ట్ అందించడం ద్వారా విద్యతోపాటు పిల్లల ఆరోగ్యం పై ప్రభు త్వానికి గల శ్రద్ధను వివరించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ కోఆర్డి నేటర్లు ఉమా రామప్పడుతోపాటు వి.వో.ఏ. లు జయలక్ష్మి, రమణమ్మ, గురుమూర్తి, సుజాతా రామ్మో హన్ తదితరులు పాల్గొన్నారు.

ఆ రెండు పార్టీలకు భావ సారూప్యత లేదు

- మనుగడ కోసమే టిడిపి జనసేన పొత్తులు
- వైఎస్సార్ సీపీ ప్రచార విభాగం జోనల్ ఇన్చార్జి "చింతాడ"

విశాలాంధ్ర-ఆమదాలవలస: టిడిపి, జనసేన పార్టీలు వాటి మనుగడ కోసమే పొత్తులు ప్రకటించు కున్నాయని, ప్రజా సంక్షేమం గురించి వాటికి నిబద్ధత లేదని, ఆ రెండు పార్టీల మధ్య భావ సారుప్యత లేదని వైఎస్ఆర్సిపి ప్రచార విభాగం జోనల్ ఇన్చార్జి చింతాడ రవికుమార్ అన్నారు. మంగళవారం స్థానిక ఆమదాలవలస లో గల జగనన్న ప్రజాసేవా కార్యాలయం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2014 ఎన్నికల తర్వాత ఆంధ్రప్రదేశ్ లో టిడిపి జనసేన పార్టీలు మునిగి పోవటం ఖాయమని, ప్రజల పట్ల చిత్తశుద్ధి ఉంటే ఓట్లు పడతాయి కాని, పొత్తుల వలన ఓట్లు రావని చింతాడ రవికుమార్ అన్నారు. టిడిపి-జనసేన పొత్తు వలన జనసైనికుల మనోభావాలు ఘోరంగా దెబ్బతిన్నాయని, పవన్ కళ్యాణ్ జన సైనికుల మనోభావాలకి వ్యతిరేకంగా, తన స్వార్థం కోసం చంద్రబాబుతో పొత్తు పెట్టుకున్నారని, దీని వలన పవన్ కల్యాణ్ జనసైనికుల ఆగ్రహానికి గురవక తప్పదనీ అన్నారు. అవినీతిపై పోరాడుతానని ప్రగల్భాలు పలికే పవన్ కల్యాణ్ ఇప్పుడు అవినీతి చేసి జైలులో ఉన్న చంద్రబాబు అడుగులకు మడుగులు వత్తుతున్నారని, ఇది పవన్ కళ్యాణ్ లో నిలకడ లేని తనానికి, స్వార్ధ రాజకీయాలకు నిదర్శనమని తెలిపారు. వ్యవస్థల న్నింటి ని గుప్పిట్లో పెట్టుకుని విర్ర వీగి అవినీతి చేసిన చంద్రబాబు ఇక శాశ్వతంగా జైల్లోనే ఉంటారని, తొందరలోనే అవినీతికి పాల్పడిన మిగతా టిడిపి నాయకులు జైలుకి వెళ్ళటం ఖాయమని రవికుమార్ ఆ ప్రకటనలో అన్నారు.

కొత్తకోట వారి వీధిలో చెత్త సమస్య...

- రోడ్డుపైకే మురుగునీరు... - చోద్యం చూస్తున్న అధికారులు

విశాలాంధ్ర-ఆమదాలవలస: పుర పాలకు సంఘ పరిధిలోని కొత్తకోట వారి వీధిలో చెత్త సమస్య వెంటాడుతుంది. రోడ్డు కు ఒకవైపు మురుగు కాలవ ఉన్నప్పటికీ గృహాల నుంచి కనెక్టింగ్ లేక రోడ్డుపైనే మురు గునీరు ప్రవహిస్తుంది. దీంతో ఆ ప్రాంతం దుర్గంధపూరితంగా మారి ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. స్థాయిలో ఉన్న అధికారులు, ఉన్నత స్థానాల్లో ఉన్నవారు ఈ వీధిలో ఎక్కువగా నివాసం ఉంటున్నారు. అటువంటి వారి నివాసమున్న వీధిలో మురుగు సమస్య కొత్తగా తలెత్తుతుంది. ఇటీవల ప్రాంతానికి వచ్చిన కొందరు రోడ్డుపై చెత్త వేయడంతో అది పేరుకుపోయి ముక్కు పుటలదిరె దుర్గంధాన్ని వెదజల్లుతుంది. శానిటేషన్ సిబ్బంది ఎప్పటికప్పుడు పరిస రాలు శుభ్రం చేస్తున్నప్పటికీ కొంతమంది కావాలని అక్కడ చెత్త నిల్వలు వేస్తున్నట్లు స్థానికులు అంటున్నారు. గతంలో ఆ ప్రాంతంలో కంపరోస్టర్ బీన్ ఉండేది. నివాస గృహాల నుండి వెలువడే తడి పొడి చెత్తలు వేర్వేరుగా కలెక్ట్ చేసి శానిటేషన్ సిబ్బంది వచ్చేటప్పుడు ఆ బండికి అందించాల్సి ఉన్నప్పటికీ అలా చేయకుండా రోడ్డుపైనే పడేస్తున్నారు. అంతేకాకుండా పురపాలక సంఘం అందించిన డస్ట్ బిన్లను కూడా వినియోగించిన పరిస్థితి ఉంది. కొన్ని ప్రాంతాల్లో ఇంకో ఇంటికి మూడు డస్ట్ బిన్ లు కూడా ఇవ్వలేదని వాదన కూడా విని పిస్తుంది. శానిటరీ అధికారులు నిర్లక్ష్యం కారణంగా వాలంటీర్లు గృహాలలో నివాసం ఉండే వారికి డస్ట్ బిన్ లు అందించలేదని కొంతమంది అంటున్నారు. ఏది ఏమైనప్పటికీ చెత్త నిలువలు, మురుగునీరు రోడ్డుపై ప్రవహించడం వంటివి నివారించాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారు అన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మున్సిపల్ ఉన్నతాధికారులు ఈ విషయాన్ని పరిశీలించి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

చంద్రబాబు అరెస్టును ఖండిస్తూ 'మనం చేద్దాం జగనాసుర దహనం'

విశాలాంధ్ర-కవిటి: నారా చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టును ఖండిస్తూ చంద్రబాబుకు మద్దతుగా రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు ఇచ్చాపురం నియోజవర్గ శాసనసభ్యులు డాక్టర్ బెందాళం అశోక్ ఆధ్వర్యంలో మండలంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం రామయ్యపుట్టుగలో మనం చేద్దాం జగనాసుర దహనం కార్యక్రమం సోమవారం రాత్రి చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్,మండల తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి సైకో పోవాలి అనే రాసిన ప్రతులను దగ్ధం చేశారు. సైకో పోవాలి సైకిల్ రావాలి అంటూ టిడిపి శ్రేణులు నినాదాలతో హోరెత్తించారు. అక్రమ కేసులు బనాయించి చంద్రబాబును అరెస్టు చేయటం అన్యాయమని ఎం ఎల్ ఏ అశోక్ అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి సభ్యులు పొందల కృష్ణారావు, బెందాళం రమేష్, కవిటి మండలం తెలుగుదేశం పార్టీ నాయకులు ఎస్ వి రమణ, బెందాళం సురేష్, కోర్రాయి వాసుదేవరావు, కడియాల వెంకటరావు, బెందాళం తిరుమలరావు, పి రాజు, యర్ర బాసు ప్రదాన్, ప్రగడ మనిబాబు, తెదేపా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కరువు మండలంగా ప్రకటించాలి : మాజీ ఎమ్మెల్యే కలమట

విశాలాంధ్ర-మెళియాపుట్టి: గడచిన కొంతకాలంగా వర్షాలు లేక పంట పొలాలు ఎండిపోతున్నాయని రైతులని ఆదుకునే దశగా మెళియాపుట్టి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని పాతపట్నం నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ అన్నారు. సోమవారం ఆయన మెళియాపుట్టి మండల పరిధిలో గల పెద్దపద్మాపురం రెవెన్యూ పరిధిలో గల క్షేత్రస్థాయిలో పంట పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడుతూ ఈ ఏడాది వర్షాలు అంతంతమాత్రంగానే ఉన్నాయని దీంతో రైతులు అధికమొత్తంలో నష్టపోయే అవకాశం ఉందంటూనే, పాతపాట్నం నియోజకవర్గ పరిధిలో గల మెళియాపుట్టి, పాతపాట్నం, ఎల్.ఎన్. పేట మండలాలను కరువు మండలలుగా ప్రకటించాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుత స్థానిక ఎమ్మెల్యే రెడ్డిశాంతి గడప గడప కార్యక్రమం అంటూ గ్రామాలలో తిరుగుతున్నారే తప్ప, గ్రామాలలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టే పరిస్థితులు లేవన్నారు. పర్యటనలో మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణతో పాటు మండల దేశంపార్టీ అధ్యక్షుడు భాస్కరగౌడ, పైల లచ్చుమయ్య, మండల వైస్ ఎంపీపీ బైరిసింగి దినాకర్, జెనసేన పార్టీ నాయకులు బాలరాజు, రవ్వల గణపతి, శ్రీధర్, లూకలాపు భాస్కరరావు, పరమేశ్వర్, నాయుడు, పలువురు నాయకులు, రైతులు, గ్రామస్థులు తదితరులున్నారు.

ఎలుగుబంటి నుంచి కాపాడాలి

అటవీ శాఖ అధికారులకు సర్పంచ్ విజ్ఞప్తి

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : సంతబొమ్మాళి గత మూడు రోజుల నుంచి అర్ధరాత్రి సమయాల్లో హల్ చల్ చేసి. ప్రభుత్వ విద్యార్థులకు, అంగన్వం వాడి పిల్లలకు ఇస్తున్న తినుబండారాలను ధ్వంసం చేస్తుందని అటవీ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు సంతబొమ్మాలి పంచాయతీ సర్పంచ్ కళింగపట్నం లక్ష్మీ అప్పారావు అటవీ శాఖ అధికారులను కోరినట్లు తెలిపారు. గత మూడు రోజుల నుంచి అంగన్వాడి సెంటర్ లతోపాటు ప్రభుత్వ పాఠశాలలో ప్రవేశించి విద్యార్థులకు ప్రభుత్వం అందజేస్తున్న సరుకులను మోసం చేస్తుందని అటవీ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. రాత్రి సమయాల్లో ఎలుగుబంటి తిరుగుతున్నందున సంతబొమ్మలలో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని వారు కోరినట్లు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని ఎలుగుబంటి చర్యలు నుంచి కాపాడాలని ఆ ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు.

కడిగిన ముత్యంలా చంద్రబాబు రావాలంటూ పూజలు

విశాలాంధ్ర సంతబొమ్మాళి.. జైల్లో ఉన్న కేంద్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కడిగిన ముత్యంలా విడుదల కావాలని లక్కివలస పంచాయితీ సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు పిట్ట రాజులు ఆధ్వర్యంలో దుర్గాదవికి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు. ఆయనతో తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నాట్లు ఆయన తెలిపారు.

విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో గొండు శంకర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్ : నగర కార్పోరేషన్ పరిధి స్థానిక దమ్మలవీధి బోదమ్మ కోవెలలో శ్రీ జీవేశ్వర స్వామి ఆలయంలో శ్రీ అభయాంజనేయ స్వామి వారు మరియు శ్రీ దక్షిణామూర్తి స్వామివారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం సందర్భంగా ఆలయంలో జరుగుతున్న చండి యాగ కార్యక్రమానికి ఆలయ కమిటీ వారి ఆహ్వానం మేరకు వెళ్లి పూజ కార్యక్రమంలో శ్రీకాకుళం నియోజకవర్గ టిడిపి యువ నాయకులు మరియు ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా సర్పంచ్ సంఘం అధ్యక్షులు గొండు శంకర్, టీఎన్ఎస్ఎఫ్ శ్రీకాకుళం నియోజకవర్గం ప్రెసిడెంట్ రెడ్డి శంకర్, సింగుపురం ఎంపిటిసి పంగ సత్యం నారాయణ, బగ్గు రాము, పొన్నాడ కిషోర్, పొన్నాడ ప్రసాద్, తాల్ల రావి, కిమిడి మల్లేష్, పట్నాన హరి ప్రసాద్, అనిల్ బాబు శర్మ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రైతుల ఉసురు వైసీపీకి తగులుతుంది

విశాలాంధ్ర-వజ్రపుకొత్తూరు : వంశధార శివారు భూములకు వైసీపీ అధికారంలోకి వచ్చిన నుండి సాగునీరు అందడం లేదని, రైతుల ఉసురు వైసీపీ ప్రభుత్వానికి తగులుతుందని మాజీ ఎంపీపీ జి. వసంతస్వామి, టీడీపీ అధ్యక్షుడు సూరాడ మోహనరావు లు అన్నారు. మంగళవారం వజ్రపుకొత్తూరు టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో వారు మాట్లాడుతూ రైతులు సాగునీటి కోసం ఇబ్బందులు పడుతుంటే వైసీపీ నాయకులు హేళనగా మాట్లాడడం వారికి రైతు సమస్యలు పట్ల ఉన్న నిర్లక్ష్య ధోరణి కి అద్దం పడుతుందని అన్నారు. అధికారం చేతిలో ఉండి సాగునీరు అందించకుండా మాజీ ఎమ్ఎల్ ఏ శివాజీ ని అడగండి అంటూ దిగజారుడు ప్రకటనలు చేయడం సిగ్గుచేటు అన్నారు. వంశధార ఎగువ ప్రాంతంలో అచ్చెన్నాయుడు లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు వలన శివారు భూములకు నీరు రావడం లేదని వైసీపీ నాయకులు డొంకతిరుగుడు మాట్లాడుతున్నారని, 2018 వరకు నీరు వచ్చిందని గుర్తు చేసారు. 2019 లో వైసీపీ అధికారంలోకి వచ్చిన నుండి శివారు భూములకు సాగునీరు అందడం లేదని ఏ రైతును అడిగినా చెబుతారు అన్నారు. నీరు తీసుకొని రావడం చేతకాకపోతే నోరు అదుపులో పెట్టుకొని ఉండాలని, మాజీ మంత్రి శివాజీ పై విమర్శలు చేయడం అర్థరహితం అన్నారు. శివాజీ ఎమ్మెల్యే గా ఉన్న సమయంలో అధికారంలో ఉన్నప్పటికీ రైతు సమస్యలపై సొంత ప్రభుత్వాన్ని నిలదీసిన చరిత్ర ఉందని, ప్రభుత్వానికి వ్యతిరేకంగా శివాజీ గడ్డం దీక్ష చేసిన సంగతి ప్రజలకు గుర్తు ఉందన్నారు. శివారు భూములకు సాగునీరు తీసుకొని రాలేని మంత్రి అప్పలరాజు అసమర్థత పై శివారు ప్రాంతంలో ని వైసీపీ నాయకులు ప్రశ్నించాలని హితవు పలికారు. మంత్రి అప్పలరాజు ను రైతులు తిరగబడే రోజు దగ్గర లోనే ఉందన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు వలనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది అన్నారు. సైకో జగన్ పాలనకు అన్ని వర్గాల నుండి వ్యతిరేకత, టీడీపీ కి పెరుగుతున్న ఆదరణ చూడలేక అక్రమంగా జైలు లో పెట్టి శునకానందం పొందుతున్నారు అని విమర్శించారు. ప్రజలే తగిన విధంగా సైకో జగన్ ప్రభుత్వానికి బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ సమావేశంలో తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి. శశిభూషణ్, టీడీపీ పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు పి. సాంబమూర్తి, టీడీపీ మాజీ అధ్యక్షుడు గోవింద పాపారావు, మాజీ ఎంపీటీసి గర్తం దానేసు, ఎ. ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

సాగునీటి వనరులు అభివృద్ధి చేయాలి

విశాలాంధ్ర-పలాస/మందస: అన్నదాతలైన రైతుల భూములకు పుష్కలంగా సాగు నీరు వనరులు ఉన్నప్పటికీ అభివృద్ధి లేక ప్రతీ ఏడాది సాగునీటికి అన్నదాతలు ఆక్రందన చెందుతున్నారు. పంట సాగుండి పుష్కలంగా రావల్సి ఉన్నప్పటికీ సాగునీటి వనరులు అభివృద్ధి లేక పంట చేతికి అందే పరిస్థితి అందనంత దూరంలో ఉండి పోతుంది. దీంతో ఏటా రైతులు సాగునీరు సక్రమంగా అందక ఆందోళన చెందుతున్నారు. చిన్ననీటి వనరులను వినియోగించుకుంటే భారీగా ప్రయోజనాలు పొందవచ్చు. భూ సేకరణ, అటవీ, పర్యావరణ అనుమతులతో సంబంధం లేకుండా తక్కువ వ్యయం, తక్కువ సమయంతో సులువుగా నిర్వహణ చేసుకోవడానికి వీలున్నవి చిన్న నీటి వనరులే. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ఏర్పడి నాలుగున్నారేళ్లు దాటినా నీటి వనరులు అభివృద్ధి అవుతాయని ఆయకట్టు రైతులు ఎదురు చూస్తున్న ఆ కల నెరవేరలేదు. దీనికి సంబందించిన వివరాలిలా ఉన్నాయి. ఇదీ పరిస్థితి. మహేంద్ర తనయ పర్వతాలను అనుకొని ఉన్న మందస మండలంలోని సాగునీటి వనరులను అభి వృద్ధి చేస్తే వేలాది ఎకరాలు సస్యశ్యామ లమవుతాయి. జలా శయాల గర్భాలు, ఇసుక మేటలు పొదలతో నిండిపోవ డంతో పాటు నిర్వాహణ కరువై మరమ్మతులకు గురయ్యాయి. దీంతో నానాటికి జలాశయాల్లో నీటి నిలువ సామర్థ్యం తగ్గిపోయి రైతులకు సాగునీటి కష్టాలు తప్పటం లేదు.

కళింగదళ ప్రాజెక్టు: అది ఒడిస్సా సరిహద్దుకు సమీపం లోని కురుడాలు గిరిజన గ్రామం వద్ద కళింగదళ్ రిజర్వాయిరు ఉంది. దీనికి కుడి, ఎడమ కాలువలు పరిధిలో సుమారు 2000 ఎకరాలుకు సాగునీరు అందాల్సి ఉంది. కాని ప్రధాన కాలువలు, పిల్ల కాలువలు మరమ్మతులు లేకపోవడంతో ఆయకట్టు భూములకు సాగునీరు సక్రమంగా అందడం లేదు. ఇక్కడ ప్రధాన స్లూయిస్లు 25 ఏళ్ళ నుంచి మరమ్మతులకు నోచుకోవడం లేదు. దీనిలో ఏడాది పొడుగున నీరు ఉంటుంది. ఈ రిజర్వాయిరు అభివృద్ధి చేస్తే మరింత నీటి సామర్థ్యాన్ని పెంచుకొనే వీలుంటుంది. జలాశయం గర్భంలో ఇసుక మేటలు, పొదలు విపరీతంగా పెరిగిపోయి గట్లు పాడై పోయి శిథిలావస్థకు చేరుకున్నాయి.. అభివృద్ధి చేస్తానున్న నాయకుల హామీలు గాలిలో కలిసిపోతున్నాయి.

దబారుసింగి జలాశయం: 25 ఏళ్ళ కిందట గోపాలసాయి గ్రామం వద్ద నిర్మించిన దబారుసింగి జలాశయం దయనీయ స్థితిలో ఉంది. గిరిజన భూములకు సాగులోకి తీసుకురావాలని లక్ష్యంగా నిర్మించిన రిజర్వాయిర్ సగం పనులు జరిగాక నమూనా మార్చారు. కాలువ నిర్మణాన్ని మధ్యలో ఆపేయడంతో దానికి అప్పట్లో ఖర్చు చేసిన 20 లక్షలు రూపాయిలు వృదా అయ్యాయి. అప్పట్లో ఈ ప్రాజెక్టుకు రెండు స్లూయిస్లు నిర్మించి రెండు కాలువలు నిర్మించాలి. దాని కేవలం ఎడవు కాలువతో పాటు స్లూయిస్ ను ఒక్కటే నిర్మించారు. కుడి కాలువ తో పాటు మరో స్లూయిస్ ఇంత వరకు నిర్మించలేదు. దీంతో రిజర్వాయిరు కింద భాగాన ఉన్న బంద, కొంకడా పుట్టి పంచాయితీలకు చెందిన 15 గిరిజన గ్రామాల రైతుల భూములకు సాగునీరు అందడం లేదు. కుడి కాలువ నిర్మించాలని గిరిజన రైతుల గోడు కంఠశోషగా మిగిలిపోయింది. రిజర్వాయర్ నీరు గిరిజనేతర రైతుల భూములకు మాత్రమే అందుతుంది..

గోపాల సాగరం: ఇది మందస గ్రామంకు అనుకొని ఉన్న అతి పెద్ద గోపాల సాగరం చెరువు గర్భం విస్తీర్ణం 150 ఎకరాలు. ఈ చెరువు నీరు మందస, జిల్లుండ, ఉమాగిరి, పితాతోళి, బైరిసారంగపురం, సిద్ధగాం.

సొండిపూడి, కొత్తపల్లి గ్రామాలకు చెందిన 1000 ఎకరాలకు నీరు సరఫరా అవుతుంది. గోపాలసాగరాన్ని మినీ రిజర్వాయరుగా నిర్మించాలని 35 ఏళ్ళు నుంచి రైతులు కోరుతున్నారు. కాని రైతులు చిరకాల వాంఛ నేటికీ నేరవేర లేదు, చెరువు కాలువలు మరమ్మతులు లేదు రైతులు భూములకు సాగు నీరు అందడం లేదు. దీనిని అభివృద్ధి చేస్తే మందసతో పాటు పరిసర పంచాయితీల ఆయకట్టు భూములకు నీరందించే అవకాశం ఉంటుంది. ఈ సాగరంలో ఇసుక మేటలు, ముళ్ల పొదలతో నిండి నీటి నిలువ సామర్థ్యం తగ్గిపోయింది. దీనిపై అధికారులు శీత కన్ను వేయడంతో రైతులు నిరాశ చెందుతున్నారు.

దామోదర సాగరం రిజర్వాయరు: ఇది నర్సింగపల్లి పంచాయితీలోని దేవుపురం వద్ద దామోదర సాగర్ రిజర్వాయరును 6 కోట్ల రూపాయల వ్యయంతో 2003లో నిర్మించారు. రిజర్వాయరుకు ఇంత వరకు కుడి, ఎడమ కాలువలు నిర్మించలేదు. దీంతో లక్ష్యం. నెరవేర లేదు. 1200 ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉండగా రైతులకు పూర్తిగా సాగునీరు అందడం లేదు.. దీంతో పిడిమందస, మద్య, వాసుదేవుపురం, చత్రపురం, రాజపురం, నర్సిం గపురం, కుంటికోట గ్రామాల పరిధిలో ఉన్న సాగుభూములు బీడు భూములుగా మారిపోతున్నాయి.

బిడిమి జంతి బంద: మందస, వజ్రపుకొత్తూరు. మండలాల సరిహద్దు ఉద్దాన ప్రాంతంలో బాహదపల్లి: సమీపంలో బిడిమి జంతిబంద ఉంది. ఇక్కడ రిజర్వాయరు నిర్మాణానికి 30 ఏళ్ళ ప్రతిపాదనలతోనే కాలం గడుస్తోంది. ఇక్కడ రిజర్వాయరు నిర్మాణానికి ఎన్నోసార్లు నిధులు మంజూరు అయినా టెండరు దశకు చేరుకునే సరికి టెండరు వేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. దీంతో రిజర్వాయిర్ కోసం ఉద్దానం రైతులు, ప్రజలు ఎన్నో ఆశలు

పడినప్పటికీ ఆశలు ఆవిరి అవుతున్నాయి.

సంకుజోడు : మకర జోల వద్ద ఉన్న సంకుజోడు. చెరువు గర్భం విస్తీర్ణం 300 ఎకరాలు ఈ చెరు వును మినీ రిజర్వాయరు నిర్మించాలని దశాబ్దాలు తరబడి రైతులు కోరు తున్నారు. ఇక్కడ రిజర్వా యర్ నిర్మిస్తె మకరజోల, కమలాపురం, కుంటికోట, పారిపురం, బాలిగాం. భిన్నల మదనాపురం, వరద రాజపురం, గోవిందపురం, రాజ పురం, అంబుగాం, తాళంద్ర గ్రామాల పరిధిలో 1500 ఎకరాలు భూములకు సాగునీరు అందుతుంది. కాని రైతాంగం ఆశలు నెరవేరక సాగునీరు అందక రైతులు అవస్థలు పడుతున్నారు.

సునాముది: మండలంలో ప్రధాన సాగునీటి వనరు నాముది గెడ్డ మహేంద్ర గిరుల్లో ప్రారంభమైన గెడ్డ, మందస, సోంపేట మండలాల మీదుగా సుమారు 25 కిలో మీటర్లు ప్రవహిస్తుంది. దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ ఆనకట్ట శిధిలావస్థకు చేరి నీరు వృదా అవుతుంది. దీనికి ప్రధాన సాగునీటి కాలువలు 12, పిల్ల కాలువలు 60 వరకు ఉన్నాయి. సునాముది కాలువలకు మహేంద్ర గెధుల నుంచి నీరు అందుతుంది. ఈ కాలువలు ద్వారా 12000 ఎకరాలు భూములకు సాగునీరు అందుతుంది.. కాని కాలువలు మరమ్మతులు లేక రైతుల భూములకు -సాగునీరు సక్రమంగా అందడం లేదు. కాలువల్లో ఇసుక దెబ్బలు, పిచ్చిమొక్కలు పేరుకుపోవడం, కాలువలు ఆక్రమణకు గురి కావడంతో సాగునీరు అందక రైతులు నానా కష్టాలు పడుతున్నారు. కాలువలు మరమ్మతులు కోసం ఆయకట్టు రైతులు మూడు దశాబ్దాలు నుంచి కోరుతున్నారు. కాని, రైతుల సమస్యలు కోసం పట్టించుకోవడం లేదు..

రైతుల సమస్యలపై నిర్లక్ష్యం: రైతాంగం సమస్యలు పరిష్కరించడంలోను, సాగునీటి వనరులు అభివృద్ధి చేయటంలో పాలకులు పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారని, ఇప్పటికైనా రైతులు సమస్యలను పరిష్కరించి సాగు నీటి వనరులను అభివృద్ధి చేయాలని ప్రజాప్రతినిధులను అధికారులను కోరుతున్నారు.

అప్రమత్తతే శ్రీరామరక్ష

- పురుగు మందుల వినియోగంలో జాగ్రత్తలు తప్పనిసరి

విశాలాంధ్ర-కోటబొమ్మాళి: నాణ్యమైన అధిక దిగుబడులు సాధించడం కోసం, చీడపీడలు, తెగుళ్ళ నుంచి పంటను కాపాడుకోవడానికి రైతులు రసాయన మందులను పిచికారీ చేస్తుంటారు. ఇటువంటి సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే ప్రాణాలకే ముప్పు వాటిల్లే ప్రమాధముందని అధికారులు, వైద్యులు హెచ్చరిస్తున్నారు. నియోజకవర్గంలో నందిగాం, టెక్కలి, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి మండలాల్లో ఎక్కువగా వరి, మొక్కజొన్న, వేరుశనగ, మిరప, కూరగాయలు తదితర పంటలు సాగు చేస్తుంటారు. ఏటా వంశధార కాలువ కిందతో పాటు వివిధ ఆయకట్ట పరిధిలో ఎక్కువగా వరి వేస్తారు. కోటబొమ్మాళి మండలంలో ఖరీఫు సీజన్‌లో వరి 10వేల హెక్టార్లలో కూరగాయలు 300, వేరుశనగ 300, ఇతర పంటలను వెయ్యి హెక్టార్లలో సాగు చేస్తున్నారు. ప్రస్తుతం వరి పంటకు దోమ సోకిందని, కూరగాయలకు పురుగు సోకుతుందని ఎక్కువగా మందులు కొడుతున్నారు. ఈ పంటలకు రసాయన మందులు పిచికారీ చేసే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

సేంద్రియ విధానం మేలు : పంటల చీడపీడల నివారణకు క్రిమి సంహారక మందులు వినియోగించేటప్పుడు రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి, అవసరమైన మేర మాత్రమే వాడాలి సేంద్రియ విధానంలో వ్యవసాయం చేయడం అలవాటు చేసుకుంటే భూమి సారమంతంగా ఉంటుంది. దిగుబడులు కూడా అధికంగా సాధించవచ్చు. ఇక తప్పనిసరి పరిస్థితుల్లో రసాయన మందులు వాడకంలో మెలుకువలు పాటించాలి. రసాయన మందులు వాడేటప్పుడు రంధ్రాలు పడిన యంత్రాలను వాడకపోవడం మంచిది. గాలి వీచే దిశలో మాత్రమే పిచికారీ చేయాలి, వాడిన మందు డబ్బాలను భూమిలో పాతి పెట్టడం, కల్చేయడం మంచింది.

-ఎస్. గోవిందరావు, మండల వ్యవసాయాధికారి, కోటబొమ్మాళి.

నిర్లక్ష్యం చేయొద్దు : పొలాల్లో చీడపీడల నివారణకు రసాయన మందులు పిచికారీ చేసే సమయంలో రైతులు ప్రత్యేకమైన దుస్తులు ధరించాలి, తర్వాత చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలి. శ్వాస తీసుకోవడం కష్టంగా ఉన్నా, కళ్ళు మంటగా ఉన్నా వెంటనే వైద్యుల్ని సంప్రదించాలి.

దుర్గా పూజల్లో అచ్చెన్నాయుడు దంపతులు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : మండలం నిమ్మాడ కూడళ్లో ఏర్పాటు చేసిన దుర్గాదేవి నవరాత్రులను పురస్కరించుకొని మంగళవారం టెక్కలి శాసనసభ్యులు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు సతీసమ్మేళనంగా దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన భవాని భక్తులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామాల్లో ఆధ్యాత్మిక చింతన పెంపొందించాలని, అందరు సొదరి బావంతో మెలిగి శాంతియుత వాతావణంతో కలికట్టుగా ఉండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆయన సతిమణి విజయమాధవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సరస్వతీ దేవి పూజలు

విశాలాంధ్ర-సంతబొమ్మాళి... దసరా నవరాత్రుల నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా, సరస్వతి దేవి అలంకరణ లో భాగంగా సంతబొమ్మాళి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న సరస్వతి దేవి విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. సంతబొమ్మాళి ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు బరాటం కామరాజు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు విద్యార్థులు సరస్వతి దేవి కి షోడాసోపాచార పూజలు నిర్వహించి మంగళ హారతులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

జనసేనవైపు సలాన అడుగులు

విశాలాంధ్ర-మెళియాపుట్టి : సుమారు 40 సంవత్సరాలు పాటు రాజకీయాలలో ఉంటూ వివిధ పదవులు నిర్వర్తించిన సీనియర్ నాయకులు, మాజీ మండల అధ్యక్షులు సలాన మోహనరావు జనసేన పార్టీ వైపు అడుగులు వేయనున్నట్లు తెలిపారు. మండలంలో గల వసుంధర గ్రామంలో మంగళవారం తన స్వగృహంలో పత్రిక విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కుటుంబం రాజకీయంగా దశాబ్దాల కాలంగా ప్రజలకు సేవలందిస్తున్నామని, తనకు కూడా రెండు దశాబ్దాలుగా ప్రత్యక్ష రాజకీయాల్లో అనుభవం ఉందన్నారు. అయితే గత కొన్నాళ్ళుగా తాను తటస్థంగా ఉన్నానన్నారు. తాను ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని నిజాయితీగా పరిపాలన సాగించానని ఆ దశగానే మరల నియోజకవర్గస్థాయిలో ప్రజలకు సేవలందించేందుకు జనసేన పార్టీలో నడవాలని తన కోరికని తెలియజేశారు. అయితే ఈ విషయమై గడచిన కొంతకాలంగా నియోజకవర్గ స్థాయి ఐదు మండలాల్లోని గ్రామాల్లో ఉన్న తన మిత్రులు, శ్రేయోభిలాషులను కలసి అందరి అభిప్రాయం తెలుసుకున్నానన్నరు. రాజకీయాలకు దూరంగా ఉన్నప్పటికీ ప్రస్తుత రాష్ట్ర రాజకీయాల నేపథ్యంలో జనసేనపార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఆలోచనలు, సిద్ధాంతాలు తనకు నచ్చి అటువైపు అడుగులు వేస్తున్నానాని విజయదశమి సందర్భంగా తన మనసులో మాట బహిర్గతం చేస్తున్నానని త్వరలో ఆ పార్టీ నాయకులతో, కార్యకర్తలతో సంప్రదింపులు జరిపి అధికారికంగా తెలియజేస్తానన్నారు. ఈ సమావేశంలో సలాన మోహనరావుతో పాటు సలాన వినోద్ కుమార్, పుల్లంసెట్టి మోహన్, సలాన గిరిమాస్టారు, సలాన వెంకటరావు, తదితరులున్నారు.

చెడుపై మంచి సాధించిన విజయమే విజయదశమి

- ప్రతి ఒక్కరూ దుర్గుణాలను విడనాడాలి
- తెలుగు ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు
- ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ దానేటి శ్రీధర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకే దసరా అని ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ దానేటి శ్రీధర్ అన్నారు. నగరంలోని ఆర్ట్స్ కళాశాల రోడ్ లో ఉన్న డాక్టర్ దానేటి శ్రీధర్ హాస్పిటల్ లో మంగళవారం విజయదశమి వేడుకలను నిర్వహించారు. ముందుగా ఆసుపత్రిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ దుర్గాదేవి అమ్మవారు దుర్గముడు, మహిషాసురుడు వంటి రాక్షసులను సంహరించిన అనంతరం దేవతలు, ప్రజలు కలిసి ఈ విజయాన్ని వేడుకగా నిర్వహించుకున్నారని తెలిపారు. దీనిని ఆనవాయితీగా ఇప్పుడు మనం విజయదశమికి నిర్వహించుకుంటున్నామని పేర్కొన్నారు. ఎవరైతే ఇతరులకు ఇబ్బందులు కలగజేస్తారో, సాటి వ్యక్తులను బాధపెడతారో వారందరూ రాక్షసులతో సమానం అని పేర్కొన్నారు. కామ, క్రోధ, మోహ, లోభ, మద, మత్సర, స్వార్థ, అన్యాయ, అమానవత, అహంకారం వంటి పది

దుర్గుణాలు మనల్ని దారి తప్పిస్తాయన్నారు. చెడు పనులకు ప్రోత్సహిస్తాయనీ, అవి పరోక్షంగా ఇతరులకు హాని చేస్తాయని పేర్కొన్నారు. అందుకే వీటిపై విజయం సాధించాల్సి ఉంటుందనీ ప్రజలను కోరారు. నిజానికి దసరా పండుగ అంతరార్థం - దశ, హర అంటే పది చెడు లక్షణాలను తొలగించుకోవడం అని అర్థమని వివరించారు. ఈ వేడుకల్లో గైనకాలజిస్ట్ డాక్టర్ ఎం స్వర్ణలత, పిరియాడిక్ట్ సీపాన రాజేష్, జగన్, రమణమూర్తి, మోహన్, రాము, అప్పారావు, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

వాడవాడలా విజయదశమి సంబరాలు

విశాలాంధ్ర, సంతబొమ్మాళి : విజయదశమి పర్వదినోత్సవ సందర్భంగా సంతబొమ్మాళి మండలంలో వాడవాడల విజయదశమి ఉత్సవాలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పత్రి కొమ్మలను తమ పంట పొలాల్లో ఉంచి పంటలను కాపాడాలని మొక్కులు తీర్చుకున్నారు. అలాగే బోరుభద్రలో దుర్గా భవాని మాలలు వేసిన భక్తులు నవరాత్రి ఉత్సవాలు ముగింపు సందర్భంగా దుర్గాదేవిని ఊరేగింపుగా చేసి తమ మొక్కులను తీర్చుకున్నారు.

బెర్మ్ లేకుండానే బిల్లుకు యత్నం

- అధికారులపై వైసీపీ ప్రతినిధి వైఖరి
- జీజీఎంపీ నిధులు కాకిలెక్కలే

విశాలాంధ్ర-ఆమదాలవలస: కనీస నాణ్యతలతోపాటు బెర్మ్ పనులు పూర్తి చేయకుండానే బిల్లులు చేసుకునేందుకు అధికార పార్టీకి చెందిన వ్యక్తి పావులు కదుపుతున్నట్లు తెలిసింది. పట్టణంలోని గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా వచ్చిన వినతులను పరిశీలించి పనులు చేపట్టేందుకు అధికారులు అందుకు తగ్గ అంచనాలను రూపొందించారు. సచివాలయ పరిధిలో రూ.10లక్షలు చొప్పున పనులు చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఇందుకు తగ్గట్టుగా ఆమదాలవలస 8వ వార్డు గేటు ప్రాంతంలోని స్మశాన వాటికకు రూ.10లక్షలతో పైపు కల్వర్ట్‌తోపాటు రోడ్డు సర్దుబాటులో 16 అడుగులు ఉండే విధంగా సీఎస్పీ రోడ్డు నుంచి స్మశాన వాటిక వరకు సిమెంట్ రహదారితోపాటు కాలువ నిర్మాణం చేపట్టారు. ఇందుకు గాను రూ.10లక్షలతో అంచనా రూపొందించారు. ఇదిలా ఉండగా రోడ్డుకు ఒకవైపు మురుగు కాలువ ఉంది. మరోవైపు బెర్మ్ వేయాల్సి ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు అంచనాల్లో బెర్మ్ పనులు చూపించలేదని ఇంకో కార్యక్రమంలో ఎస్టిమేట్ చేసి పనులు పూర్తి చేసేందుకు కాంట్రాక్టర్ అధికారులకు వివరించినట్లు తెలిసింది. ఈ మిషతోనే బెర్మ్ వేయకుండా బిల్లు చేసుకునేందుకు అధికారులపై వైసీపీ ప్రతినిధి తీవ్ర ఒత్తిడి చేస్తున్నట్లు తెలిసింది. అక్కడక్కడా కొంత నాణ్యతలు లేనప్పటికీ స్థానిక నాయకుల ప్రోద్భలంతో పనులు పూర్తయ్యాయి. అలాగే 19వ వార్డు పాత ఆమదాలవలసలో రూ.10లక్షలతో సిసి రహదారి నిర్మాణాన్ని కూడా ఇదే కాంట్రాక్టర్ పనులు చేశారు. నాణ్యతలతోపాటు కనీసం వాటరింగ్ చేయకపోవడంతో పనులు పూర్తిగా పాడవుతాయని స్థానికులు అన్నారు. వాటరింగ్ సరిగా లేకుండా క్యూరింగ్ కాదని దీంతో పెచ్చులూడిపోయే అవకాశం ఉంది. అధికారులు కనీసం వాటరింగ్ చేయించేందుకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఆ పనుల్లో కూడా నాణ్యతలు లేవని స్థానికులు బహిరంగానే ఆరోపిస్తున్నారు. కాంట్రాక్టర్ కూన ఆంజనేయులు పేరున పనులు మంజూరు అయినప్పటికీ స్థానిక నాయకుడు పనులు చేసేందుకు అధిష్టానం మౌఖిక ఆదేశాలు ఇచ్చినట్లు తెలిసింది. దీంతో ఆ నాయకుడు తన ఇష్టారాజ్యంగా పనులు నిర్వహించి బిల్లులు చేయాలని అధికారులపై ఒత్తిడి తెస్తున్నట్లు తెలియవచ్చింది. నాణ్యతలు లోపంపై మున్సిపల్ సాంకేతిక సిబ్బందికి వివరణ కోరగా... పోర్ కటింగ్ (నాణ్యత ప్రమాణాలు) ద్వారా అంచనా ప్రాప్తికి బిల్లులు చేయనున్నామని తెలిపారు. ఇందులో ఎటువంటి నాణ్యతా లోపాలు జరగలేదని ఒక వేళ అటువంటి పరిస్థితి ఉంటే వారికి చెల్లించే బిల్లుల్లో కోత ఉంటుందని వివరించారు. బెర్మ్ విషయంపై ప్రశ్నించగా.. మరోసారి పనులు చేపడితే అప్పుడు పూర్తి చేయనున్నట్లు ఒక ప్రశ్నకు సమాధానంగా తెలిపారు.